





ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
5-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 236

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# విజయ్ విహారం..

## తమిళనాట టీవీకే సంచలనం.. బెంగాల్‌లో ఓడిన తృణమూల్




## సువర్ణాధ్యాయం మొదలు

సంప్రదాయ బెంగాలీ దోతీ కుర్తాలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో నితిన్ నబిన్

- గంగామాత ఆశీస్సులతో చరిత్రాత్మక విజయం
- ఢిల్లీలో బీజేపీ కార్యాలయంలో విజయోత్సవ సభలో ప్రధాని మోదీ
- అస్సాంలో హాట్రిక్‌పై హర్షం.. పుదుచ్చేరిలో ఎన్డీఏను విశ్వసించారని కితాబు
- పశ్చిమాసియా సంక్షోభాన్ని భారత్ సమర్థంగా ఎదుర్కొంటోందని వెల్లడి
- అంగ్.. బంగ్.. కలింగ్‌లను కలిపి భారత్ వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టీకరణ
- కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకేలు మహిళల ఆగ్రహాన్ని రుచి చూశాయని చురకలు

2లో

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో దశాబ్దాల నిరీక్షణ తర్వాత సువర్ణాధ్యాయం మొదలైందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. హింస, భయం, బుజ్జగింపు రాజకీయాలకు స్వస్తి పలికి బెంగాల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు పలు రాష్ట్రాల ఉప ఎన్నికల్లో ఎన్డీఏ సాధించిన చరిత్రాత్మక విజయాలను ఆయన అపూర్వం, అద్వితీయంగా అభివర్ణించారు.

అంచనాలకు ఏమాత్రం అందని విజయం..! ఒంటరి పోరులో 'దళపతి' విజయ విహారం..! పెరంబూర్, తిరుచిరాపల్లి (ట్రిచీ) ఈస్ట్ రెండు చోట్లా 'విజిల్'మోత! చరిత్ర సృష్టించిన మరో ఎంజీఆర్‌గా విజయ్.. రెండేళ్లలోనే బలమైన రెండు ద్రవిడ పార్టీలను మట్టి కరిపించారు.. పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే గురి తప్పకుండా లక్ష్యాన్ని ఛేదించారు.. తమిళనాట సరికొత్త చరిత్ర సృష్టించారు.. అధికార పీఠానికి అడుగు దూరంలో నిలిచారు. తమిళనాడు శాసనసభ ఎన్నికల ఫలితాల్లో దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభంజనం సృష్టించింది. దశాబ్దాలుగా రాజకీయాలను శాసిస్తూ వచ్చిన ద్రవిడ పార్టీల కోటలను బద్దలు కొట్టి అతి పెద్ద పార్టీగా టీవీకే అవతరించింది. అధికార పీఠానికి మరొక్క అడుగు దూరంలో నిలిచింది. టీవీకే 107 స్థానాలలో విజయం వైపుగా దూసుకెళ్లి ద్రవిడ పార్టీల శకానికి ముగింపు పలికింది.




- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో సంచలనాలు నమోదు
- ద్రవిడ నేలపై ఎగ్జిట్‌పోల్ అంచనాలు తలకిందులు
- తొలి ఎన్నికల్లోనే 'జననాయగన్' జయకేతనం
- 107 సీట్లతో అతిపెద్ద పార్టీగా టీవీకే అవతరణ
- సిట్టింగ్‌స్థానం కొళత్తూర్‌లో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ
- వెస్ట్ బెంగాల్‌లో తొలిసారి పాగా వేసిన బీజేపీ
- భవానీపూర్ స్థానంలో మమతకు పరాజయం
- కేరళలో లెఫ్ట్‌కు షాక్.. యూడీఎఫ్‌కు పగ్గాలు
- అస్సాంలో కమలం.. పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్
- శిష్యుడి చేతిలో రెండోసారి పరాజయం
- 35 ఏండ్లలో తొలిసారి ఓటమిపాలు

2లో

**తమిళ నాడు (234)**

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| టీవీకే | 107 | - | +107 |
| డీఎంకే+ | 74 | 159 | -85 |
| ఏఐడీఎంకే+ | 53 | 75 | -22 |
| ఇతరులు | 1 | 0 | +1 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 118

**పశ్చిమ బెంగాల్ (293/294)**

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| బీజేపీ+ | 206 | 77 | +129 |
| టీఎంసీ+ | 81 | 214 | -133 |
| కాంగ్రెస్ | 2 | 0 | +2 |
| ఇతరులు | 4 | 2 | +2 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 148



హైదరాబాద్: నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ తమిళనాడులో అతిపెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 234 స్థానాల్లో 107 సీట్లను గెలుచుకొని విజయ ఢంకా మోగించింది. అధికార డీఎంకే కూటమి 74 స్థానాలకు పరిమితమయ్యింది.

## కమ్యూనిస్టుల పాలన కనుమరుగు?

**దేశంలో వామ పక్షం సీఎం లేకపోవడం 50 ఏండ్లలో ఇదే తొలిసారి**



న్యూఢిల్లీ, మే 4: దేశ చరిత్రలో 50 ఏండ్ల తరువాత మొదటిసారి కమ్యూనిస్టులు పరిపాలనలో లేకుండా పోయారు. వారి చివరి కోట కేరళలో

## తమిళనాడులో ఓటమిపై స్పందించిన స్టాలిన్

- ప్రజా తీర్పును గౌరవిస్తున్నామన్న డీఎంకే అధినేత
- ఇప్పటి దాకా సమర్థ పాలన అందించాం, ఇక నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామన్న స్టాలిన్
- జీవితంలో ఎన్నో గెలుపోటములు చూశానన్న స్టాలిన్

2లో



## ఎన్టీఆర్ బాటలో విజయ్!..

- పార్టీ స్థాపించిన రెండేండ్లకే అధికారం
- ఎన్టీఆర్ తర్వాత రెండో వ్యక్తిగా రికార్డు

చెన్నై, మే 4: తమిళనాడులో అధికార పీఠం ఎక్కడానికి కొన్ని అడుగుల దూరంలో మాత్రమే ఉన్న విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ రాజకీయంగా మరో చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉంది.

## ఇకపై 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్..

- వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 24 గంటల్లో పూర్తి చేసేలా కీలక నిర్ణయం
- ప్రభుత్వ సేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై సలహా మండలి ఏర్పాటు
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని ఆదేశం
- అత్యవసర సేవలు మినహా అన్నీ ఆన్‌లైన్‌లోనే అందించాలని స్పష్టీకరణ

రాష్ట్రంలో వాహన రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. వాహనం కొనుగోలు చేసిన చోటే రిజిస్ట్రేషన్ పూర్తిచేసేలా, వాహన డీలర్లనే అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం ద్వారా కేవలం 24 గంటల్లోనే



2లో

## కేరళలో కాంగ్రెస్ గెలుపు..

- తాను చేసిన ప్రచారాన్ని గుర్తుచేసుకుంటూ రేవంత్ రెడ్డి ట్వీట్
- తన ప్రచారం సందర్భంగా ప్రజలు ఎంతో అభిమానం చూపించారన్న రేవంత్ రెడ్డి
- తెలంగాణ, కేరళలు ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి కలిగిన రాష్ట్రాలని వ్యాఖ్య
- కాంగ్రెస్‌ను గెలిపించుకోవడం ద్వారా అద్భుతమైన భవిష్యత్తుకు నాంది పలికారన్న సీఎం

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి తెలంగాణ ముఖ్యమంత్రి



2లో

## కరెంట్ అక్రమాలపై సీబీఐ!

- జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక ఆధారంగా విచారణ
- మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి
- ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపై నివేదిక సీబీఐకి అప్పగించాలని తీర్మానం
- భూముల మార్కెట్ ధరలు,రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- 26వ తేదీలోగా కొత్త ధరలు,చార్జీలు ఖరారు చేయాలని ఆదేశం

# ఇకపై 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్..

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావాలని, ప్రజలకు ఎలాంటి జాప్యం, ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఈ నిర్ణయంతో వాహనదారులు రిజిస్ట్రేషన్ కోసం రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పనుంది. సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందాలని, అందుకు అనుగుణంగా అధికారులు వినూత్న ఆలోచనలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని మరింత పెంచాలని సీఎం సూచించారు. ఏఐని సమర్థంగా వాడుకునేందుకు నిపుణులతో ఒక సలహా మండలిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, రాష్ట్రంలో డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల పర్యవేక్షణకు మధ్యప్రదేశ్ డ్రోన్ వ్యవస్థను ఎలా వినియోగిస్తుందో అధ్యయనం చేసి, ఏపీలోనూ ఆ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తీవ్రమవుతున్న ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'అవేర్' సాంకేతికతను వాడుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వడదెబ్బ తగలకుండా మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా, ప్రతి జిల్లా కలెక్టర్‌కు తక్షణ అవసరాల నిమిత్తం రూ. 1 కోటి చొప్పున నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, బోర్ల మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. కార్యదర్శుల స్థాయి అధికారులు నెలలో 3 రోజులు, శాఖాధిపతులు (హెచ్ఓడీలు) 6 రోజులు, జిల్లా కలెక్టర్లు 8 రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు కాల్ సెంటర్ ద్వారా వివరాలు సేకరించాలని సూచించారు. అత్యవసర సేవలు మినహా మిగతా అన్ని ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌లోనే అందించాలని స్పష్టం చేశారు. చేపల వేట నిషేధం ముగిశాక, 'అవేర్' డేటా ఆధారంగా చేపలు సమృద్ధిగా లభించే ప్రాంతాల వివరాలను మత్స్యకారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేరళలో కాంగ్రెస్ గెలుపు..

రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తాను కేరళలో ప్రచారం చేసిన ఫొటోలను కూడా పంచుకున్నారు. కేరళలో యూడీఎఫ్ కూటమి అసాధారణ, స్ఫూర్తిదాయకమైన విజయం సాధించిందని పేర్కొన్నారు. ఇందుకు కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. చారిత్రాత్మక విజయానికి ప్రధాన కారకులు అంటూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, వేణుగోపాల్, దీపాదాస్ మున్షీలకు కూడా అభినందనలు తెలిపారు. తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పుడు ఎంతోమంది యూడీఎఫ్ మద్దతుదారులు, కేరళ ప్రజలు తనపై ఎంతో అభిమానం చూపించారని గుర్తు చేసుకుని రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి అధికంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా అభివృద్ధిని విశ్వసిస్తాయని పేర్కొన్నారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా దశాబ్ద కాలం పాటు అన్యాయాన్ని ఎదుర్కొని, కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవడం ద్వారా అద్భుతమైన భవిష్యత్తుకు నాంది పలికాయని అన్నారు. కేరళలో కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం సాధించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రగతిశీల పాలన, ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఈ తీర్పు ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. యూడీఎఫ్‌ను కేరళ ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ అన్నారు. ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు.

## ఎన్టీఆర్ బాటలో విజయ్!..

పార్టీ స్థాపించిన రెండేండ్లకే ఏ పార్టీ అయినా అధికారం దక్కించుకోవడం అంత సులభం కాదు. దీంతో చరిత్రలో ఆ ఫీట్ సాధించిన రెండో వ్యక్తిగా విజయ్ నిలవనున్నారు. తమిళనాడులో విజయ్ విజయం చూస్తుంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దిగ్గజ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తప్పక గుర్తుకు వస్తారు. ఆయన కూడా తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల కాలంలోనే రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేసి, అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి ఏపీలో అధికారంలోకి వచ్చారు. వీరిద్దరికీ కూడా పలు పోలికలు ఉన్నాయి. ఇద్దరూ సినీ రంగానికి చెందిన వారే. ఇద్దరూ కూడా పార్టీ స్థాపించిన కొద్ది కాలానికే అధికారానికి చేరువయ్యారు. తమిళనాడులో తొలుత దివంగత ముఖ్యమంత్రి, నటుడు ఎంజీ రామచంద్రన్ వీరిద్దరికీ రాజకీయాల్లో ఆదర్శంగా పేర్కొనవచ్చు. రెండేండ్ల క్రితం తన టీవీకే పార్టీని స్థాపించిన విజయ్ ఎన్టీఆర్ మార్గంలోనే పయనించారు. రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేసి, నటుడిగా ఉన్న తనపై అభిమానాన్ని రాజకీయ అభిమానంగా మార్చుకుని అతి పెద్ద పార్టీగా ఘన విజయం సాధించారు. సినీనటులు రాజకీయ పార్టీలు పెట్టి అధికారంలో భాగస్వాములు కావడం దక్షిణాదిలో కొత్తేమీ కాదు. గతంలో పలువురు నటులు రాజకీయ ప్రవేశం చేసినా దీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగలేక పోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ నటుడు చిరంజీవి 2008లో ప్రజారాజ్యం పార్టీని స్థాపించారు. 2009 ఎన్నికల్లో 18 సీట్లు మాత్రమే నెగ్గారు. తర్వాత క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న చిరంజీవి 2011లో తన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేశారు. అతని సోదరుడు పవన్ కల్యాణ్ 2014లో ఏపీలో జనసేన పార్టీని స్థాపించారు. 2019లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి తాను పోటీ చేసిన రెండు నియోజకవర్గాల్లో ఓడిపోయారు. 2024లో ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం పార్టీతో కలిసి పోటీ చేసిన జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లో విజయం సాధించి 100 శాతం విజయాన్ని సాధించింది.

# బెంగాల్‌లో సువర్ణాధ్యాయం మొదలు



(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సోమవారం ఢిల్లీలోని బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో భారీ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టిన తొలి ఎన్నికల్లోనే కార్యకర్తలకు ఆయన ఇచ్చిన మార్గదర్శనం సత్తా చాటిందని మోదీ ప్రశంసించారు. బెంగాల్, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు మోదీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మహారాష్ట్ర, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు పట్టం కట్టిన ప్రజలకు సైతం కృతజ్ఞతలు చెప్పారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమే అయినా, 'మదర్ ఆఫ్ డెమోక్రసీ'కి భారత్ ఎందుకు మాతృభూమిగా ఉందో ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలు ప్రపంచానికి చాటిచెప్పాయన్నారు. గతేడాది బిహార్ ఎన్నికల సమయంలో గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ఎన్డీఏ ప్రభంజనం విస్తరిస్తుందని తాను చెప్పిన మాటలు నేడు నిజమయ్యాయని చెప్పారు. గంగామాతతోపాటు బ్రహ్మపుత్ర, కామాఖ్యా మాతల ఆశీర్వాదం తమపై మెండుగా ఉందన్నారు. అందుకే అస్సాం చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీజేపీకి హ్యాట్రిక్ విజయం సాధ్యమైందన్నారు. పుదుచ్చేరిలో గత ఐదేళ్లలో ఎన్డీఏ అమలు చేసిన విజన్‌కు ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చారన్నారు. ప్రస్తుతం దేశంలో 23 రాష్ట్రాల్లో ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయని, 'నాగరిక్ దేవో భవ'(ప్రజలే దేవుళ్లు) అనే మంత్రంతో తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

**శ్యామాప్రసాద్ కల సాకారం**

పశ్చిమ బెంగాల్‌ను భారత్‌లో అంతర్భాగంగా ఉంచేందుకు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ తన జీవితాన్ని ధారపోశారని మోదీ గుర్తుచేశారు. 1951లో 'దేశం కోసం జీవించాలి, దేశం కోసం మరణించాలి'అన్న ఆశయంతో ఆయన ప్రారంభించిన ప్రస్థానం, నేటి చారిత్రక విజయంతో ఆయన కల సాకారమైందన్నారు. బెంగాల్ చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైందని, నేటి నుంచి భయం నుంచి విముక్తి పొందిందని 'బాంగ్లాయ్ పోరిబోర్తన్ హోయే గెచే'(బెంగాల్‌లో మార్పు వచ్చేసింది) అని నినదించారు. వందేమాతరం 150వ వసంతంలో భరతమాతకు, బంకించంద్ర ఛటర్జీకి, అరవిందుడికీ బెంగాల్ ఓటర్లు చారిత్రక నివాళి అర్పించారన్నారు. ఇకపై అభివృద్ధి, విశ్వాసం, కొత్త ఆశలు బెంగాల్‌లో అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తాయన్నారు. యువతకు ఉద్యోగాలు, మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో చొరబాటుదారుల ఆటకట్టిస్తామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం తొలి కేబినెట్‌లోనే పేదలకు ఉచిత వైద్యం అందించే 'ఆయుష్మాన్ భారత్'పథకానికి పచ్చజెండా ఊపుతామని స్పష్టం చేశారు.

**అంగ్, బంగ్, కలింగ్...**

ప్రపంచవ్యాప్తంగా ఒకవైపు యుద్ధ సైరన్లు మోగుతూ, అస్థిరత, అరాచకం రాజ్యమేలుతున్న తరుణంలో, పశ్చిమాసియా సంక్షోభం వెంటాడుతున్నా.. భారత ప్రజలు మాత్రం స్థిరత్వం కోసం ఓటు వేశారని మోదీ విశ్లేషించారు. వికసిత భారత్ లక్ష్యంగా దేశం ఏకతాటిపై నిలబడి సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొంటోందని చెప్పారు. ప్రాచీన భారతదేశంలో అంగ్ (బిహార్), బంగ్ (బెంగాల్), కలింగ్ (ఒడిశా) రాష్ట్రాలు ఆర్థిక, రాజకీయ, వాణిజ్య మూలస్తంభాలుగా ఉండేవని గుర్తుచేశారు. ఆసియా ఖండం మొత్తం కళింగ ఓడరేవుల ద్వారా వాణిజ్యం సాగేదని, బెంగాల్ సాంస్కృతిక కేంద్రంగా ఉండేదని గుర్తుచేశారు. బానిసత్వంలో ఆ స్తంభాలు బలహీనపడ్డాయని, ఇప్పుడు మళ్లీ ఆ మూడు ప్రాంతాల ప్రజలు బీజేపీని ఎంచుకోవడం ద్వారా వికసిత భారత్‌కు బాటలు వేస్తున్నారని మోదీ సంతోషం వ్యక్తం చేశారు.

**మహిళా వ్యతిరేకులకు గుణపాఠం**

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునేందుకు ప్రయత్నించిన రాజకీయ పక్షాలు మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని తాను ముందే హెచ్చరించానని గుర్తుచేశారు. అన్నట్లుగానే కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే ఆ ఆగ్రహాన్ని రుచి చూశాయన్నారు. మహిళా విరోధిగా ముద్రపడిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి సైతం యూపీలో మహిళలు తగిన బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. కేరళలో కమ్యూనిస్టుల పదేళ్ల దుష్పరిపాలనను ప్రజలు తిరస్కరించారని, అయితే వచ్చే ఎన్నికల్లో అక్కడ కాంగ్రెస్‌కు కూడా మహిళలు తగిన సమాధానం ఇస్తారన్నారు. నేడు దేశంలో ఒక్క రాష్ట్రంలో కూడా కమ్యూనిస్టు ప్రభుత్వం లేకపోవడం కేవలం రాజకీయ మార్పు కాదని, ప్రజల ఆలోచనా విధానంలో వచ్చిన భారీ మార్పు అని మోదీ విశ్లేషించారు. యావత్ ప్రపంచం, దేశం కమ్యూనిజాన్ని, అడవుల్లో అంతరించిపోతున్న మావోయిజాన్ని తిరస్కరించినప్పటికీ, కాంగ్రెస్ మాత్రం అదే భావజాలాన్ని అక్కున చేర్చుకుంటూ విపరీత దిశలో పయనిస్తోందని ధ్వజమెత్తారు.

# కరెంట్ అక్రమాలపై సీబీఐ!



హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందంతో పాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో తీవ్ర అక్రమాలు చోటుచేసుకున్నాయని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ మదన్ బి.లోకూర్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా..వీటిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ కోరాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. జస్టిస్ లోకూర్ నివేదికను సీబీఐకి అప్పగించాలని నిర్ణయించింది. మరోవైపు రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచాలని కూడా కేబినెట్ తీర్మానించింది. సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా 9 నెలల క్రితం సీబీఐ విచారణను కోరిన రాష్ట్ర ప్రభుత్వం..తాజాగా విద్యుత్ రంగ నిర్ణయాలపై సైతం సీబీఐతో విచారణ జరిపించాలని నిర్ణయించడం గమనార్హం. మంత్రివర్గ భేటీ అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి..మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో కలిసి విలేకరులకు వివరాలను వెల్లడించారు.

**కొనుగోళ్లు, నిర్మాణం పేరిట నిధుల దుర్వినియోగం**

'తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పడిన విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్ కొనుగోళ్లకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంది. అలాగే 4000 మెగావాట్ల యాదాద్రి, 1080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..ఈ వ్యవహారాల్లో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం కింద జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలతో అదే ఏడాది జూలైలో ఆయన విచారణ నుంచి వైదొలిగారు. ఆయన స్థానంలో జస్టిస్ లోకూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించగా, అదే ఏడాది అక్టోబర్‌లో ప్రభుత్వానికి 114 పేజీల నివేదికను సమర్పించారు. దీనిపై అడ్వకేట్ జనరల్ సూచనలు, సలహాలు తీసుకున్న ప్రభుత్వం.. తాజాగా మంత్రివర్గ సమావేశంలో చర్చించింది.

## కమ్యూనిస్టుల పాలన కనుమరుగు?

జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష కూటమి పరాజయం పొందింది. 1977 తరువాత దేశంలో కమ్యూనిస్టులు అధికారంలో లేకపోవడం ఇదే మొదటిసారి. ఒకప్పుడు దేశ రాజకీయాలలో కీలకంగా వ్యవహరించిన ఎర్ర సోదరులు నేడు అక్కడక్కడా కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), వంటి పార్టీలు సంస్థాగతంగా తమ ఉనికిని చాటుకుంటున్నప్పటికీ జాతీయస్థాయిలో వాటి ప్రభావం క్రమంగా తగ్గిపోయింది. 1980 దశకంలో సీపీఎం నేతృత్వంలో వామపక్ష పార్టీలు కేరళ, త్రిపురతోపాటు పశ్చిమ బెంగాల్‌లో బలంగా ఉన్నాయి. లోక్‌సభకు 2004లో జరిగిన ఎన్నికల్లో 60 సీట్లు గెలుచుకొని ప్రధాన ప్రతిపక్షంగా కీలకపాత్ర పోషించారు.

**పశ్చిమ బెంగాల్‌లో 34 ఏండ్లు**

దేశంలోని ఒక రాష్ట్రంలో నిరంతరాయంగా సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నది సీపీఎం పార్టీ ఒక్కటే. పశ్చిమ బెంగాల్‌లో నిరాటంకంగా 34 ఏండ్లపాటు 1977 నుంచి 2011 వరకు ఆ పార్టీ అధికారంలో కొనసాగింది. దివంగత జ్యోతిబసు 1977 నుంచి 2000 సంవత్సరం వరకు 23 ఏండ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తరువాత బుద్ధదేవ్ భట్టాచార్య అధికార పగ్గాలు అందుకున్నారు. ఆయన నేతృత్వంలో 11 ఏండ్లు సాగిన కమ్యూనిస్టుల పాలన మమతా బెనర్జీ ప్రవేశంతో కుప్పకూలింది. ఆ తరువాత మరెన్నడూ బెంగాల్‌లో కమ్యూనిస్టులు తమ ప్రభావం చూపలేకపోయారు. బెంగాల్ తరువాత త్రిపురలో సైతం వామపక్షాలు సుదీర్ఘకాలం పాలన సాగించాయి. 1993 నుంచి 2018 వరకు 25 ఏండ్లపాటు అధికారంలో ఉన్నారు.

## విజయ్ విహారం..

పోటీచేసిన రెండు స్థానాల్లో విజయ్ విజయం సాధించగా.. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన తమిళనాడు సీఎం స్టాలిన్ పరాజయం పాలయ్యారు.

ఇక, దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠకు గురిచేసిన పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కంచుకోటలో బీజేపీ కూటమి తొలిసారిగా పాగా వేసింది. మొత్తం 294 సీట్లలో 208 స్థానాలను గెలుచుకొని అధికారాన్ని చేజిక్కించుకొన్నది. భవానీపూర్ నుంచి పోటీ చేసిన మమత.. బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో 15 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. కేరళలో లెఫ్ట్ కూటమికి కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గండి కొట్టింది. 140 అసెంబ్లీ స్థానాలు ఉన్న కేరళలో.. యూడీఎఫ్ కూటమి 89 స్థానాల్లో గెలుపొందగా, ఎల్డీఎఫ్ కూటమి 35 స్థానాలకే పరిమితమయ్యింది. అస్సాం లో బీజేపీ ఘన విజయం సాధించింది. 126 స్థానాల్లో బీజేపీ కూటమి 102 సీట్లు గెలుపొందగా, కాంగ్రెస్ కూటమి 21 స్థానాలకు పరిమితమయ్యింది. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్ కూటమి మ్యాజిక్ మార్కును దాటింది.

### తమిళనాడులో ఓటమిపై స్పందించిన స్టాలిన్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై డీఎంకే పార్టీ అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఆయన ఓటమిని అంగీకరించారు. తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని అన్నారు. విజేతలకు ఆయన అభినందనలు తెలిపారు. డీఎంకే ఇక నుంచి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ, ప్రభావవంతమైన ప్రతిపక్షంగా పనిచేస్తుందని అన్నారు. గత ఐదేళ్ల తమ పాలనలో ప్రజల కోసం ఎన్నో ప్రాజెక్టులు చేపట్టామని, సుపరిపాలన అందించామని అన్నారు. ఇన్నాళ్లు సమర్థవంతంగా పాలన అందించామని, ఇక నుంచి నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు. తాము చేపట్టిన అభివృద్ధి పనులను చూపించి ప్రజలను ఓట్లు అడిగామని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటిని కొనసాగిస్తామని హామీ కూడా ఇచ్చామని అన్నారు. కానీ తీర్పు తమకు అనుకూలంగా రాలేదని అన్నారు. తన రాజకీయ జీవితంలో అద్భుత విజయాలు చూశానని, అలాగే ఓటములను కూడా చూశానని పేర్కొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఘన విజయం

## విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఘన సన్మానం




**పటాన్ చేరు, మే 4,ప్రభాత సూర్య :** సంగారెడ్డి జిల్లా,పటాన్‌చెరు పట్టణం సీతారామ వెంచర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పదవ తరగతి (రాజా) ఫలితాల్లో మేటి ర్యాంకులతో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విజేతలైన విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించిన డైరెక్టర్ కరస్పెండెన్స్ నాగరాజు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ సంగాని రాజు, జోనల్ మేనేజర్ లంకల బుచ్చిరెడ్డి. ఈ సందర్భంగా చైర్మన్ సంగాని రాజు మాట్లాడుతూ.. "విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల కృషి మరియు తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమయ్యాయి. భవిష్యత్తులో మా విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని ఆకాంక్షించారు.విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా, పోటీ ప్రపంచంలో నెగ్గుకురావడానికి అవసరమైన పునాదిని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ అందిస్తుందని పేర్కొన్నారు. SSజలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు జి వంశీ ట577ఊ, జునేరా ట570ఊ, జి నందిని ట567ఊ మిగతా విద్యార్థులు అందరూ 500 పైన మార్కులు సాధించారు అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేయించి బహుమతులను అందజేశారు. మరియు ?పిల్లల విజయంలో కీలక పాత్ర పోషించిన తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా గౌరవించి, శాలువాలతో సన్మానించింది.ఈ వేడుకలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పాఠశాల అందిస్తున్న విద్యా ప్రమాణాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ స్థాపించి 25 సంవత్సరాలు అవుతున్నది అప్పటి నుండి విద్యార్థుల రికార్డులు మోత, విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్ సంఘాని రాజు, యాజమాన్యం. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్స్ నాగరాజు, లక్ష్మి ప్రసన్న, మరియు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో రమేష్ గౌరకు పీహెచ్.డీ



**పటాన్చెరు, మే 4,ప్రభాత సూర్య :** పటాన్చెరు మండలం లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి రమేష్ గౌర డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'మెథిమజోల్, లెవోడోపా, మిటాపివాట్ సల్ఫేట్, వారెనిక్లిన్ టార్ట్రేట్ అనే క్రియాశీల ఔషధ పదార్థాల వినూత్న సంశ్లేషణ పద్ధతుల అభివృద్ధి'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్.సురేంద్ర బాబు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రమేష్ చేసిన డాక్టరల్ పరిశోధన, కీలకమైన ఫార్మాస్యూటికల్ సమ్మేళనాల కోసం సమర్థవంతమైన, సురక్షితమైన, ఆర్థికంగా లాభదాయకమైన సంశ్లేషణ మార్గాలను రూపొందించడంపై దృష్టి సారించినట్టు తెలిపారు. డాక్టర్ రమేష్ నాలుగు ముఖ్యమైన క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐల) కోసం నూతన, విస్తరించదగిన ప్రక్రియలను అభివృద్ధి చేసి, తద్వారా దిగుబడి, మలినాల నియంత్రణ, ప్రక్రియ భద్రత, పారిశ్రామిక సాధ్యతను గణనీయంగా మెరుగుపరిచినట్టు వివరించారు. ముఖ్యంగా, ఆయన చేసిన కృషిలో మెథమజోల్ కోసం క్వాలిటీ బై డిజైన్ (క్యూబీడీ) ఆధారిత పటిష్టమైన ప్రక్రియ, లెవోడోపా కోసం సరళీకృత రెండు దశల సంశ్లేషణ, మిటాపివాట్ సల్ఫేట్ కోసం ఆప్టిమైజ్ చేసిన బహుళ దశల మార్గం, అధిక స్వచ్ఛత, నియంత్రణ సమ్మతిని నిర్ధారించే వేరెనిక్లిన్ టార్ట్రేట్ కోసం నైట్రోసమైన్ రహిత మార్గం ఉన్నాయని రుజువు చేశాడన్నారు. అధునాతన విశ్లేషణాత్మక లక్షణాల మద్దతుతో ఆయన చేసిన పరిశోధన, ఔషధ తయారీకి ఆచరణాత్మక, పరిశ్రమకు సంబంధించిన పరిష్కారాలను అందిస్తూ, ప్రాసెస్ కెమిస్ట్రీ రంగంలో విలువైన పురోగతికి దోహదపడుతుందని తెలిపారు. డాక్టర్ రమేష్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను, ఇల్లు దెబ్బతిన్న వారిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

## బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్



**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 04)ప్రతినిధి :** నిన్న కురిసిన అకాల వర్షాలు మరియు బలమైన ఈదురు గాలుల వల్ల నష్టపోయిన ప్రజలను వెంటనే ఆదుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈదురు గాలుల ప్రభావంతో నిమ్మకాయలు, మామిడికాయలు భారీగా నేలరాలాయని తెలిపారు. అలాగే బలమైన గాలుల వల్ల ఇళ్ల పైకప్పుల రేకులు ఎగిరిపోయి, ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా తడిసిపోయిందన్నారు. దీంతో నిరుపేద కుటుంబాలు నిలువ నీడ లేక వీధిన పడిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రకృతి వైపరీత్యంతో రైతులు, ఇంటి యజమానులు సర్వం కోల్పోయారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.అకాల వర్షాల కారణంగా వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయిందని, ఐకెపి కేంద్రాల నిర్వహణలో జరిగిన జాప్యం కూడా దీనికి కారణమని పేర్కొన్నారు. తడిసిన ధాన్యంపై ఎలాంటి అభ్యంతరాలు పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



# రైతులు యూరియా వాడకం తగ్గించాలి

## వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శాంతి

**ప్రభాత సూర్య నర్సాపూర్ మే 04:** హత్నూర మండల పరిధిలోని చింతల చెరూ రైతు వేదికలో ఆయా గ్రామాల రైతులతో వ్యవసాయ శాస్త్ర వేత్తలు సమావేశమయ్యారు. ప్రతి పొలంలో పంట మార్పిడి చేయాలని సూచించారు. అంతే కాకుండా రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడినట్లయితే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటదని తెలిపారు. అదే విధంగా ప్రతి సంవత్సరం మట్టి నమున సేకరించి పరీక్షలు చేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ గీత గుండ్లమాచునూర్ సర్పంచ్ బేగరి శ్రీహరీ, ఉప సర్పంచ్ గునుకుంట్ల శంకర్ , చింతల్ చెరువు సర్పంచ్ మమత శివ , ఉపసర్పంచ్ అంబటి భాస్కర్ , కొత్తగూడెం సర్పంచ్ మమత రమేష్ , నాగారం సర్పంచ్ వరాల వీరేశం , షర్కాన్ పల్లి సర్పంచ్ మన్నే లక్ష్మిశ్రీన్ఫుూజా డైరెక్టర్ అంబటి యాదయ్య, ఏ.ఈ.ఓ.మనిషా ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# గట్టుప్పల్లో డబుల్ రోడ్డు మంజూరు చెయ్యాలి

## మాజీ జడ్పీటిసి కర్నాటి వెంకటేశం



**గట్టుప్పల. ప్రభాత సూర్య.మే4:** గట్టుప్పల మండల కేంద్రం లో డబుల్ రోడ్డు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని మాజీ జడ్పీటిసి కర్నాటి వెంకటేశం డిమాండ్ చేశారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో డబుల్ రోడ్డు కొరకు గతంలో ఆర్ఎండ్ బి అధికారులు సర్వే నిర్వహించారని ఇట్టి డబుల్ సిసి రోడ్డు మంజూరు కొరకు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లనని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఇట్టి రోడ్డు మంజూరు కొరకు సంబంధిత జిల్లా ఆర్ఎండ్ బి అధికారులకు 8 కోట్లతో ప్రతిపాదనలు ఆర్ఎండ్ బి ఈఎన్సీ, కి పంపితే నేటి వరకు మంజూరు కాలేదని ఆరోపించారు.గ్రామంలో ఇరుకు రోడ్లతో వాహనదారులకు ఇబ్బందులు రెండు బస్సులు ఎదురెదురుగా వస్తే వెళ్ళలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు.వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఆర్ఎండ్ బి ఈఎన్సీ వద్ద పెండింగ్ లో ఉన్న ఇట్టి డబుల్ రోడ్డు ప్రతిపాదనలను మంజూరు చేయించి నిర్మాణం చేపట్టాలని అన్నారు



# అకాల వర్షం బీభత్సం

## వేప చెట్టు కూలి బర్రె మృతి

**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 04)ప్రతినిధి :** మాడుగులపల్లి మండలం, ఆగామోత్కూర్ గ్రామంలో ఆదివారం అకాల వర్షం, గాలిదుమారం కారణంగా దుర్ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పళ్ళ శీను తన పశువులను కాసుకొని వచ్చి ఇంటి సమీపంలోని వేప చెట్టుకు బర్రెను కట్టేసి ఇంటి పనుల్లో నిమగ్నమయ్యాడు. ఈ సమయంలో అకస్మాత్తుగా వీచిన బలమైన గాలిదుమారం వల్ల వేప చెట్టు కొమ్మలు విరిగి కిందపడటంతో బర్రె తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన బర్రె విలువ సుమారు రూ.50,000 వరకు ఉంటుందని యజమాని తెలిపాడు. ఈ ఘటనతో పళ్ళ శీను కుటుంబం ఆవేదనకు గురైంది. అకాల వర్షాలు, గాలిదుమారాలు గ్రామీణ ప్రాంతాల్లో పశువుల నష్టానికి కారణమవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనల్లో బాధిత రైతులకు, పశువుల యజమానులకు తగిన పరిహారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఘనంగా కొమరగూడెం వెంకటేష్ జన్మదిన వేడుకలు నిర్వహణ.




**పటాన్చెరు, మే 4,ప్రభాత సూర్య :** పటాన్చెరు నియోజకవర్గానికి చెందిన కొమరగూడెం వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన పటాన్చెరు శాసనసభ్యుడు మైపాల్ రెడ్డిని కలిసి ఆశీర్వాదం పొందారు. అనంతరం తన జన్మదిన వేడుకలను శ్రీ మహాదేవుని ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఓంకార్ పూజారి మాట్లాడుతూ, వెంకటేష్ ఆలయ సేవా కార్యక్రమాలలో చూపుతున్న కృషి అపారమని తెలిపారు. దేవాలయానికి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, ప్రతి రోజు ఆలయ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ఉదయం ఐదు గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొని వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# రామచంద్రాపురంలో జనాభా గణనపై అధికారులతో సమావేశం



**రామచేంద్రపురం, మే 4,ప్రభాత సూర్య :** పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రాపురం, రామచంద్ర రెడ్డి నగర్ కాలనీలో ఈ రోజు శానిటేషన్ విభాగానికి చెందిన అధికారులు కేశవ్, మల్లికార్జున్ ఆధ్వర్యంలో జనాభా గణన కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు ఆదర్శ్ రెడ్డి ను అధికారులు మర్యాదపూర్వకంగా కలసి జనాభా గణన ప్రక్రియ, దాని ప్రాధాన్యం, నిర్వహణ విధానంపై చర్చించారు. ప్రభుత్వానికి అవసరమైన ఖచ్చితమైన సమాచార సేకరణలో ప్రజల పాత్ర కీలకమని వివరించారు. జనాభా గణనలో భాగంగా ఆదర్శ్ రెడ్డి స్వయంగా తన కుటుంబ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలను ఉద్దేశించి, ప్రతి ఒక్కరూ నిజమైన మరియు పూర్తి వివరాలను అందించి ప్రభుత్వ కార్యక్రమానికి సహకరించాలని కోరారు.

# కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



**సంస్థాన్ నారాయణపురం, మే 04(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో రైతు వేదికలో ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి హాజరై లబ్ధిదారులు సికిలమెట్ల లక్ష్మీ ప్రసన్న, బచ్చనబోని సృజన, బాకారం మమత, భూపని కావేరి, చిలువేరు ఉమామహేశ్వరి, కట్ల ఉషశ్రీ, కుర్మతి వసంత, నాతి సాయి గీత, రాచకొండ అశ్విని, రాసాల స్రవంతి, ఇష్టం సుప్రియ, చిలువేరు ప్రసన్న, మెగావత్ హరిత లకు సర్పంచ్, ఎమ్మార్వో,వార్డ్ సభ్యుల చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి చెక్కులు వచ్చినందుకు మాకు ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురపెల్లి వెంకటేష్, పందుల యాదగిరి గౌడ్, కట్ల వనజ భాస్కరాచారి, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, ఆర్ ఐ జుబేర్, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు



**మిర్యాలగూడ మే 4:-( ప్రభాత సూర్య):** మట్టి ఆరోగ్య కార్డులను మిర్యాలగూడ వ్యవసాయ శాఖ అదనపు పూర్తి బాధ్యతల అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎఓ మేకల ఋష్యేంద్రమణి పంపిణి చేశారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రైతువేదిక మిర్యాలగూడలో రైతు వారోత్సవాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా మట్టి నమూనాల సేకరణపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. మట్టి ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. మట్టి ఆరోగ్య కార్డుల (ఎస్హెచ్సి) ఆధారిత ఎరువుల వాడకాన్ని ఆమె వివరించారు. పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎరువుల విచక్షణాయుత వినియోగం, సమీకృత పోషక నిర్వహణ (ఐఎన్ఎం)పై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల వినియోగంలో 4ఆర్ సూత్రాలు సరైన మూలం, సరైన మోతాదు, సరైన సమయం, సరైన పద్ధతి పాటించాలని చెప్పారు.నానో ఎరువులపై అవగాహన కల్పించారు. కృషి సఖుల ద్వారా సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. సిఫార్సు చేయబడిన వరి రకాల సన్న రకాల సాగును ప్రోత్సహించాలన్నారు. బిపిటీ -5204, ఆర్ఎన్ఆర్ 15048, ఖచీవీ కెఎన్ఎం 1638, మీఖ ఎంటీయు 1010, - కెఎన్ఎం 118, ఆర్ఎన్ఆర్ 28361, జీ+ూ జెజిఎల్ 24423 నాణ్యమైన విత్తనాలను అధీకృత డీలర్ల నుండి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు బిల్లులను నిర్వహించాలని, నకిలీ విత్తనాలను నివారించాలని రైతులకు సలహా ఇచ్చారు. హెచ్టి కాటన్ పై అవగాహన కల్పించారు. సర్పంచులు, రైతుల భాగస్వామ్యంతో సహా నిగ్రాని సమితుల పాత్రపై రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మేకల ఋషేంద్రమణి , హార్టికల్చర్ ఆఫీసర్ నసిమా, వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్ నాయక్, హెచ్ఇఓ ఎల్లయ్య, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ కొరమాండల్ నిఖిల్, రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 72 ఫిర్యాదులు నమోదు.....

### అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగమే 41 ఫిర్యాదులు.....



**మాదాపూర్ ప్రభాత సూర్య:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పౌరుల నుంచి విశేష స్పందన లభించగా మొత్తం 72 ఫిర్యాదులు నమోదయ్యాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించినవి అత్యధికంగా 41 ఉండగా, ఇంజినీరింగ్ 14, అర్బన్ బయోడైవర్సిటీ 5, స్పోర్ట్స్ 3, శానిటేషన్ 2, రెవెన్యూ (ప్రాపర్టీ ట్యాక్స్) 2, ఎలక్ట్రికల్ 1, అడ్వర్టైజ్మెంట్ 1, హౌసింగ్ 1, విజిలెన్స్ డ ఎన్ఫోర్స్మెంట్ 1, ఎస్టేట్స్ 1 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ సంబంధిత విభాగాధిపతులతో కలిసి ప్రతి ఫిర్యాదును సమీక్షించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ ఫిర్యాదులు అధికంగా ఉండటంతో వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి ఫిర్యాదును ప్రత్యేక ట్రాకింగ్ ఐడి ద్వారా పర్యవేక్షిస్తూ పారదర్శకంగా పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

# ఎస్ ఎస్ సి లో మెరిట్ సాధించిన 66విద్యార్థులకు 25 లక్షల పారితోషికం అందజేసిన : ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మిర్యాలగూడ మే 4:- ప్రభాత సూర్య):** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ బిఎల్ఆర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజవర్గ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్సి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికం అందజేశారు. ప్రతి ప్రభుత్వ హైస్కూల్ నుంచి మొదటి, రెండో ర్యాంకర్లకు నగదు పారితోషికం 66 మందికి రూపాయలు స్వయంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ అందజేశారు. టెన్త్ మొదటి స్థానం పొందిన విద్యార్థి ఒక్కొక్కరికి 13,000 వేలు, ద్వితీయ స్థానం పొందిన ప్రతి ఒక్కరికి రూ11,000 వేలు చొప్పున అందజేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రతి ఒక్కరికి ఉన్నత చదువులు చదివేందుకు తన వంతు ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించారు. ప్రతి సంవత్సరం మెరిట్ విద్యార్థులకు నగదు పారితోషికం సైతం ఇవ్వనున్నట్లు తెలిపారు. టీటీడీ జెఇఓ ఎ.శరత్ నాయక్ మాట్లాడుతూ ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. నల్గొండ డిసిసి అధ్యక్షుడు కైలాష్ నేత మాట్లాడుతూ విద్యార్థులు అందరూ మంచిగా చదివి ఉన్నత స్థానాలు పొందాలన్నారు. మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, డిఎస్పి రాజశేఖర్ రాజు, కమిషనర్ జి.శ్రీనివాస్, డిఇఇ బి.వెంకన్న, ఆర్థిక, గణాంకాల జిల్లా అధికారి బాలాజీ నాయక్, మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి మండలాల విద్యాధికారులు డి. ధర్మానాయక్, వరలక్ష్మి, సైదా నాయక్, లక్ష్మణ్ నాయక్, పి.రామలింగయ్యయాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి, మహబూబ్ అలీ, స్కూల్ అసిస్టెంట్ జి.కోటయ్య యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, శ్రేణులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే మార్గంలో టీటీడీ జెఇఓ శరత్ చేయూత

నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎస్సి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే బిఎల్ఆర్ నగదు పారితోషికం అందజేస్తున్న సమయంలో నేను సైతం అంటూ టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ ఎ.శరత్ నాయక్ తన వంతుగా 66 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 5,000 చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు.

# మర్రిగూడలో ప్రజా పాలన

### ప్రగతి ప్రణాళిక వ్యవసాయ శాఖ – రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు



**మర్రిగూడ మే 4 ప్రభాత సూర్య:** మర్రిగూడ మండలంలో "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమం లో భాగంగా,రైతు వేదిక మర్రిగూడ , ఎర్రగండ్లపల్లి ,లెంకలపల్లి, తమ్మడపల్లి ,రైతు వేదిక నందు వ్యవసాయ శాఖ ఏవో సహస్ ఆధ్వర్యంలో నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశము నందు భూసార పరీక్ష కార్డుల పంపిణీ మట్టి నమూనా సేకరించే విధానం సమగ్ర ఎరువుల యాజమాన్యం మరియు వానాకాలం సాగు చేయాల్సిన వరి రకాల గురించి రైతులకు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల ప్రజలు యూరియా యాప్ ఎత్తివేయాలని చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని అవసరం ఉన్నప్పుడు యూరియా దొరకట్లేదు అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు వడ్ల కొనుగోలు సెంటర్లో అవకతవకలు జరిగినచో తనను ఫోన్ లో సంప్రదించవచ్చని మనది ప్రజా ప్రభుత్వమని తెలియజేశారు, సుపెరిడెంట్ యాకుబ్ ఏ ఈ ఓ లు విజయ్, అరుణ, శ్రీలత, జయంతి, ఆయిల్ ఫామ్ ఇంచార్జ్ యాదయ్య, రైతులు ఎస్ కే సలీం, కొంపల్లి రాములు, ఎడ్ల ,కాశయ్య, కొంపల్లి సత్తయ్య, జిట్టగొని ధనంజయ్, జాల గణేష్, నీల మహేష్, పందుల కృష్ణయ్య, నీల యాదగిరి తదితులు పాల్గొన్నారు

# మారణహోమం 1990 చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మం నగరంలోని విట్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ వేదికగా మారణ హోమం 1990 చిత్రం పోస్టర్ ను ఆవిష్కరించారు. జరిగినది. చిత్ర బృందం హీరో బంధు నరేష్ విలన్ వట్టం రవి(పండు) విట్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నందు చిత్రం ప్రమోషన్ లో భాగంగా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో బంధు నరేష్ మాట్లాడుతూ ఎన్ కే.ఎస్ ఫిలిమ్స్ సమన్విత ప్రెజెంట్స్ లో రాబోతున్న మారణహోమం 1990 చిత్రం యదార్ధ సంఘటనల ఆధారంగా నేటి సమాజం కు దగ్గరగా ఉండే చిత్రంగా అభివర్ణించారు. మణుగూరు వాస్తవ్యులం కావడం వలన ఉమ్మడి ఖమ్మం జిల్లా కళాకారులుగా చిత్ర యూనిట్ తో ప్రమోషన్లను నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు మీ ముందుకు రావడం జరిగిందని త్వరలో థియేటర్లో రిలీజ్ కానున్న మరణహోమం 1990 చిత్రాన్ని ప్రతి ఒక్కరు చూసి మమ్మల్ని ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నట్లు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విట్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు కోడిరెక్క ఉమాశంకర్ మరియు గోగుల చంద్రశేఖర్ అధ్యాపకులు సతీష్ మోహన్, కల్లేపు అఖిల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల కోసం శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

**పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం ఖమ్మం- శ్రీ హాస్పిటల్ లోనే సాధ్యం**

**చైర్మన్ గుర్రం సత్యనారాయణ**

**మల్టీ స్పెషాలిటి ఎమర్జెన్సీ డ క్రిటికల్ కేర్ మరియు పిల్లల హాస్పిటల్**

**ఖమ్మం(ప్రభాత సూర్య ప్రతినిధి ):** ప్రస్తుత కాలంలో ప్రవేట్ ఆస్పటల్ అంటే సామాన్య ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది.వైద్యం పేరుతో కార్పోరేట్ వ్యవస్థ పేద ప్రజలను పట్టిపీడిస్తున్నాయి.ఖమ్మం నగరంలో కార్పోరేట్ కు దీటుగా నేరుగా ప్రజలే స్పందించే విధంగా మధ్యవర్తులు ఆర్ఎంపీలు లేకుండా అరుదైన వైద్యం అందిస్తున్న ఏకైక హాస్పిటల్ శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్. పేద ప్రజలు సహాయం అని వస్తే వెంటనే స్పందించే వ్యక్తి శ్రీ హాస్పిటల్ మేనేజ్మెంట్ గుర్రం సత్యనారాయణ. అదే వ్యక్తిత్వంతో శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను స్థాపించి స్పెషలిస్టు డాక్టర్లను పిల్లల వైద్య నిపుణుల సారథ్యంలో అరుదైన వైద్యం అందిస్తున్నామని అన్నారు. పేద ప్రజలు నేరుగా సంప్రదించే సౌలభ్యం కల్పిస్తున్నామని ఎమర్జెన్సీ కేసులు సకాలంలో స్పందించి చూడబడతాయని అన్నారు. పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తామని అన్నారు. హాస్పటల్లో 15 రోజుల పాటు ఉచితంగా ఓపి చూడబడును, అన్ని రక్త పరీక్షలపై 50% డిస్కౌంట్ ఇవ్వబడుతుందని హాస్పిటల్ మేనేజర్ మణికంఠ తెలిపారు. ప్రజలకు అణువుగా ఖమ్మం నగరం వైరా రోడ్డు పాత బస్టాండ్ కి దగ్గరగా ఆర్ సిఎం చర్చ్ ఎదురుగా హాస్పటల్ ఉంటుందని తెలియజేశారు.



# గోకుల్ ప్లాట్స్ 80 ఫీట్ల రోడ్డుపై సమస్యలు.. ప్రజావాణిలో ఫిర్యాదు...




మాదాపూర్ ప్రభాత సూర్య : ఉమ్మడి మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్లో అధ్వాన్నంగా మారిన 80 ఫీట్ల రోడ్డుతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను గమనించిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డుపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చాలని, ప్రమాదాల నివారణకు వెంటనే సెంట్రల్ డివైడర్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వినోద్ రెడ్డి, భరత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మహేష్ గౌడ్, లక్ష్మణ్, నరేంద్ర రెడ్డి, అభి తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను ప్రజావాణిలో సంబంధిత శాఖ అధికారులు పరిష్కరించాలి





**మిర్యాలగూడ మే 4:-( ప్రభాత సూర్య):** సమస్యల పరిష్కారానికి ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని మిర్యాలగూడ రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ జి. వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డివిజన్ స్థాయి ప్రజావాణి నిర్వహించాలనే ఆదేశంతో మిర్యాలగూడ డివిజన్ లో ఆర్డిఓ వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడుతూ ప్రజల సమస్యలు అన్ని శాఖల అధికారులు ప్రజావాణిలో పరిష్కరించుకోవాలని సాధ్యమయ్యే కేసులు సత్వరం చేయాలని ఆయన అన్నారు. మొదటి సారి ప్రజావాణిలో అధికారులు కొంతమంది హాజరు కాకపోవడం పట్ల ఆర్డిఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు హాజరు కాలేదని వచ్చే ప్రజావాణిలో తప్పకుండ ఆయా శాఖల హాజరు కావాలని కోరారు. ప్రజావాణిని ప్రజావాణి మంచి కార్యక్రమం, మంచి ఆలోచన అని మునిసిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. ప్రజావాణిలో ప్రజలు ముందుకు తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలని డివిజన్ పరిపాలన అధికారి శ్రీనివాస్ శర్మ, తహసీల్దార్ పి.శ్రీనివాస్ అన్నారు. తమ శాఖకు వచ్చే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హౌసింగ్ డిఇఇ శంకర్, వైద్యరోగ్య శాఖ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ దీపా, మిర్యాలగూడ అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఇంచార్జి కె. నాగమణి, ఐసీడిఎస్ దామరచర్ల ఎన్. చంద్రకళ, ఆర్ అండ్ బి హలియా సబ్ డివిజన్ డిఇఇ సతీష్, ఎక్సైజు ఎస్ఐ షేక్ పర్వీన్, ఎంపీడిఓ ఎం.శేషగిరిశర్మ, మిర్యాలగూడ వ్యవసాయ శాఖ ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎఓ మేకల బుష్యేందిరమణి, హార్టికల్చర్ ఆఫీసర్ నసీమ మెహరిన్, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఆఫీసర్ ఎస్తేర్, మత్స్య శాఖ ఎఓ కిషోర్, నీటిపారుదల శాఖ డిఇఇలు అహ్మదుల్లాహ్, బిక్షం, హాలియా సీడీపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డుపై రాస్తారోకో





## రైతులు భారీ ధర్నా రాస్తారోకో

**రామన్నపేట, మే 04(ప్రభాత సూర్య):** రామన్నపేట మార్కెట్లలో ధాన్యం పోసి నెల రోజులు దాటిన ధాన్యం కొనుగోలు చేయట్లేదని రామన్నపేట ఎమ్మార్వో ఆఫీస్ వద్ద హైవేపై పెద్ద ఎత్తున ధర్నా రాస్తారోకో నిర్వహించారు రైతులు ధర్నా చేస్తున్న క్రమంలో పోలీసులకు రైతులకు వాగ్వాదం చోటుచేసుకుంది.రామన్నపేట ఎమ్మార్వో వచ్చి భరోసా ఇవ్వకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు, రైతులు మాట్లాడుతూ మార్కెట్లలో ధాన్యం బోసి నెల రోజులు గడుస్తున్న కొనకపోవడంతో వర్షాలతో ధాన్యం తడుస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, అమాలి వాళ్లను లారీలను పెద్ద మొత్తంలో అందుబాటులో ఉంచాలని రైస్ మిల్లుల దోపిడిని అరికట్టాలి క్వింటాలుకు ఐదారు కేజీలు కట్ చేస్తున్న రైస్ మిల్లులను సీజ్ చేయాలని, కాంట వేసిన24 గంటల్లో రైతులకు డబ్బులు వేయాలని, అవినీతికి పాల్పడుతున్న అధికారులను తీసివేయాలని ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పి రైతులను అరిగోసలు పెడుతుంది అధికారంలోకి రాగానే రైతు డిక్లరేషన్ ఇంప్లిమెంట్ చేస్తామని చెప్పి దాన్ని ఊసే లేదు రైతు బంధు కు మంగళం పలికి, రైతు కూలీల మాటే లేదు, రైతే రాజు చేస్తామని చెప్పి రైతులపైనే రాజకీయం చేస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్తాం అన్నారు. కనుక వెంటనే ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలి ఎలాంటి కటింగ్ లేకుండా చూడాలి 24 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బులు పడేలా చేయాలని రైతులన్నారు.ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, పిట్ట కృష్ణారెడ్డి ముద్రబోయిన శ్రీశైలం, గుండాల మల్లేష్, భూర్ర సైదులు, కొమ్మనబోయిన ఆదినారాయణ, పిట్ట చలపతి రెడ్డి, నడిగోటి మారయ్య, తరాల నరసింహ, పెట్టా నరసింహారెడ్డి, సాగర్ల శ్రీశైలం, కన్నబోయిన శేఖర్, చింతకాయల నరేష్, నరేందర్ రెడ్డి, వేముల లింగస్వామి, వేముల వెంకన్న, గుండు రమేష్, కన్నెబోయిన వెంకన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు

# పీఏసీఎస్ చైర్మన్‌గా ఆలకుంట్ల నాగరత్నం రాజు

## ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నల్లగొండ గొల్లగూడ పి ఏ సి ఎస్ చైర్మన్ గా బాధ్యతల స్వీకరణ


**నల్గొండ ప్రభాత సూర్య :** నల్లగొండ గొల్లగూడ పి ఏ సి ఎస్ చైర్మన్ గా ఆలకుంట నాగరత్నం రాజు ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోల్లగూడ పీఏసీఎస్ నుండి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తూ రైతులకు సకాలంలో ఋణాలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు సేవ చేయడం ఎంతో అదృష్టం అని వారికి ఎలాంటి కష్టాలు ఎదురు కాకుండా రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తూ సొసైటీని మొదటి స్థానంలో ఉంచడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు సిబ్బంది మరియు అభిమానులు చైర్మన్ ను పూల మాలలు, బోకే,శాలువాతో అభినందిస్తూ సన్మానించారు.



# శేరిలింగంపల్లి మండల తహశీల్దార్‌కి ఖానామెట్ చెరువు కబ్జాపై సిపిఐ నేతల ఫిర్యాదు..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 7లో గల 6.05 ఎకరాల చెరువు స్థలాన్ని కూకట్ పల్లి సర్వే నెంబర్ల పేరుతో కబ్జా చేసి సెల్లార్ తొవ్వుతున్న ఎన్వీఎన్ కన్స్ట్రక్షన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవా లని సిపిఐ పార్టీ నాయకులు శేరిలింగంపల్లి తహసీల్దార్ కి లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ ఈదులకుంట చెరువు కనుమరుగవుతుంది. ఇంకో నాలుగు ఐదు రోజులు ఆగితే చెరువు స్థలములో బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తాయి. ఇప్పటికే చెరువును ఎన్వీఎన్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ ఆధీనంలోకి తీసుకొని, ఈదులకుంట చెరువు స్థలంలో షరవేగంగా సెల్లార్ తవ్వేస్తున్నారు. అందులో నిర్మాణాలు చేసేందుకు సన్నదమవు తున్నారు. గతంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ చెరువును సందర్శించి ఇది ఈదులకుంట చెరువేనని డిక్లేర్ చేశారు. ఖానామెట్ సర్వేనెంబర్ 7లో ఉన్న 6 ఎకరాల 5 గుంటలు ఇది ప్రభుత్వ భూమి అని ఈదులకుంట చెరువుగ పేర్కొటు రెవెన్యూ అధికారులు రాతపూర్వకంగా వివరాలు ఇచ్చారు. హైడ్రా ఏర్పాటు తర్వాత మరోసారి కబ్జా నుండి కాపాడాలంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు ప్రజలు. దీనిపై స్పందించిన కమిషనర్ ఈదులకుంట చెరువును మూడు సార్లు స్వయంగా సందర్శించి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు చెరువు వద్దకే పిలిపించి హద్దులను నిర్ణయించాలని ఆదేశించారు. అప్పటికి చెరువు చుట్టూ ఉన్న ఫెన్సింగ్ ను పరిశీలించిన ఆయన తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కానీ ఇప్పుడు పెద్ద పెద్ద జెసిబిలతో సెల్లార్ కొడుతూ చెరువును కనుమరుగు చేశారు. చెరువులు కాపాడాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు టి రామ కృష్ణ, శేరిలింగంపల్లి మండల కార్యదర్శి కె చందు యాదవ్, కె వెంకట స్వామి, కె కాశీ, బి నారాయణ, జెట్టి శ్రీనివాస్, రఘు లు తహసీల్దార్ కు విజ్ఞప్తి చేశారు.


COMMUNIST PARTY OF INDIA
SERILINGAMPALLY CONSTITUENCY



# ముద్దంగుల తిరుపతి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం....


**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** చలివేంద్రం ప్రారంభం అనేది సేవాభావాన్ని ప్రతిబింబించే గొప్ప కార్యక్రమం అని డీసీసీ అధ్యక్షులు చైర్మన్ చల్లా నరసింహ రెడ్డి అన్నారు.వేసవికాలంలో దాహంతో బాధపడుతున్న ప్రజలకు చల్లని త్రాగునీరు అందించడం నిజమైన మానవత్వానికి ఉదాహరణ అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. సోమవారం రోజు మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ మెయిన్ రోడు వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దంగుల తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీసీ అధ్యక్షులు చైర్మన్ చల్లా నరసింహ రెడ్డి, ఓబీసీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్, టీపీసీసీ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు శ్రామిక శక్తి అవార్డు గ్రహీత నల్ల సంజీవ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోర్డినేటర్ రఘునందన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, నాయకులు ప్రభాకర్ రెడ్డి, వీరేందర్ గౌడ్ మరియు ఇతర నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: ఈ వేడి కాలంలో ప్రజలకు చల్లని త్రాగునీరు అందించడం ఒక గొప్ప సేవ.నీరు జీవం' అని మనం చెప్పుకుంటాం.ఆ జీవాన్ని కాపాడటానికి మనం చేస్తున్న ఈ చిన్న ప్రయత్నం ఎంతో విలువైనదని అన్నారు..ఈ చలివేంద్రం ద్వారా ప్రతి ఒక్కరికీ ఉచితంగా శుద్ధమైన నీరు అందించడం ద్వారా సమాజానికి సేవ చేయడం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు..ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షులు మోహనరెడ్డి, నాయకులు రాంచందర్ యాదవ్, ఇలియాస్ షరీఫ్, రాంప్రభు, రాంచందర్ గౌడ్, రవి కుమార్, వెంకట్ రెడ్డి, కట్ల శేఖర్ రెడ్డి, వెంకన్న, శ్రీహరి గౌడ్, కృష్ణ, నరేందర్ ముదిరాజ్, శేఖర్, బ్లాక్ అధ్యక్షులు శ్రీదేవి, సంగీత గౌడ్, శాంత తదితరులు పాల్గొన్నారు..

# మాడుగులపల్లి మండల కేంద్రంలో ఘనంగా బిజెపి విజయోత్సవ ప్రదర్శన



**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 04)ప్రతినిధి :** ఐదు రాష్ట్రాల సాధారణ ఎన్నికల ఫలితాలలో భాగంగా పచిమ బెంగాల్ అస్సాం పొదుపుచేరి రాష్ట్రాలలో బిజెపి పార్టీ అధికారం కైవసం చేసుకున్న సందర్భంగా మాడుగులపల్లి మండల కేంద్రంలోని బిజెపి మండల అధ్యక్షులు ఇటికాల జాన్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు అంబరానంటే సంబరాలు చేసుకున్నారు బాణసంచా కాల్చారు.కార్యకర్తలు జై బిజెపి నినాదాలు ఇచ్చారు స్వీట్లు పంచుకుంటూ ఈ విజయం కార్యకర్తలకు మంచి ఉత్సాహాన్ని నింపిందని భావించారు ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఇటికల జాన్ రెడ్డి మాట్లాడుతూ మోడీ-షాల వ్యూహం ఫలించిందని, వెస్ట్ బెంగాల్ ప్రజలకు విముక్తి లభించిందని అస్సాం పుదుపుచేరి రాష్ట్రాలలో అభివృద్ధిని చూసి మరొకసారి బిజెపి పార్టీకి అక్కడి ప్రజలు పట్టం కట్టారని చెప్పుకొచ్చారు ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ ఎంతైనా అవసరం ఉందని చెప్పారు రేపు రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బిజెపి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ఆ సమయం దగ్గర్లోనే ఉందని చెప్పుకొచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ బొమ్మకంటి నరసింహ మాడుగులపల్లి మండల ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మణ్ సోషల్ మీడియా కన్వీనర్ దారమళ్ళ నాగరాజు మండల బీజేవైఎం అధ్యక్షులు రాజవరపు గురుస్వామి మండల నాయకులు గుడుగుంట్ల శ్రీనివాస్ చిలుముల శ్రీనివాస్ రెడ్డి విద్యాసాగర్ మర్రి నాగరాజు బూత్ అధ్యక్షులు ఎర్రమాధ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏడేళ్ల పాప పది రోజులుగా అదృశ్యం




**మిర్యాలగూడ , మే 4:- (ప్రభాత సూర్య) :** మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలని నుండి తల్లి దివ్య మానసిక వికలాంగురాలు ఏప్రిల్ 25న మధ్యాహ్నం తన ఇంటి నుండి పాప (6 నుండి 7ఏళ్ల )నీ తీసుకెళ్ళి ఎక్కడో విడిచిపెట్టినదని పాప కనిపిస్తే నంబర్లకు సిఐ మిర్యాలగూడ 8712670150 ఎస్ఐ మిర్యాలగూడ 2టౌన్ 9966498185 ఫోన్ చేసి తెలపాలని ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. నాగభూషణరావు అన్నారు. ప్రజలు మనకెందుకు లే అనుకోకుండా పాప ఆచూకీ పట్ల మానవతా హృదయంతో స్పందించాలని కోరారు .



## విజయ డెయిరీ పాల ఉత్పత్తులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### నల్గొండ మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్గొండ ప్రభాత సూర్య :** ప్రభుత్వ డెయిరీ విజయ పాల ఉత్పత్తులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్గొండ మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం రవీందర్ నగర్ లో విజయ తెలంగాణ డెయిరీ మిల్క్ పార్లర్ ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కల్తీ లేని పాల ఉత్పత్తులను తెలంగాణ విజయ డెయిరీ అందిస్తుందన్నారు. మన్నికగా ఎలాంటి కల్తీ లేకుండా ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ పాల డెయిరీ ఆహార ఉత్పత్తులను ప్రజలకు తక్కువ ధరతో అందిస్తుందన్నారు.ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా పాలు,నెయ్యి ,పెరుగు,బాదం మిల్క్ ,పన్నీర్, ఐస్ క్రీములు, కోవా, వాటర్ బాటిల్ ,కీర్ మీక్స్, మిల్క్ కేక్, బట్టర్ మిల్క్, ఫుల్ క్రీం పాలు, టెట్రా మిల్క్ ,తదితర ఉత్పత్తులను డెయిరీ నుండి ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. కల్తీ లేని ఆహార ఉత్పత్తులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు రామగిరి అఖిల్ రావు,ఆల్లి సుభాష్ యాదవ్,అల్లి మల్లికార్జున్ యాదవ్,విజయ డైరీ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్, జిల్లా డిస్ట్రిబ్యూటర్ వి. రాజేంద్రప్రసాద్ ,విజయ డైరీ నిర్వాహకులు,పి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభిమానులు అధికారులు, చిన్నారులు మధ్య ఘనంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ జన్మదిన వేడుకలు





**మిర్యాలగూడ మే 4:- (ప్రభాత సూర్య):** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి బిఎల్ఆర్ జన్మదిన వేడుకలు సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుండి నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భారీగా తరలి వచ్చి పూలమాలలు, బొకేలు అందించి కేకులు కట్ చేసి తినిపించి శు భాకాంక్షలు తెలిపారు. ఉదయం నుండి రాత్రి వరకు శుభాకాంక్షల వెల్లువ కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గాన్ని సమర్థవంతంగా నడిపిస్తూ, స్థిరత్వం, శక్తి, సమన్వయం, సహకారం, దృఢ నాయకత్వంతో అన్ని వర్గాల నాయకులను ఒకటిగా నడిపిస్తూ ప్రజా రాజకీయాలకు నూతన దిశను చూపిస్తున్నారు. ప్రతి నిర్ణయంలో ప్రజాహితం ప్రతిబింబించే నాయకత్వం మాకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయమన్నారు.ఆశీస్సులు, మార్గదర్శకత్వం ఎల్లప్పుడూ బలంగా నిలుస్తూ, ప్రజలకు మరింత సేవ చేయడానికి ప్రేరణనిస్తుంద న్నారు.దీర్ఘాయుష్షుతో, ఆరోగ్యంతో మరింత ఉన్నత స్థానాలు అధిరోహిస్తూ ప్రజలకు ఇంకా విశిష్ట సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరారు.

# తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికల కొనుగోలు చేయాలి

## లారీలు,గన్ని బ్యాగ్స్ కొరత లేకుండా చూడాలి...తూకంలో మిల్లర్ల మోసాన్ని అరికట్టాలి





**ప్రభాత సూర్య మాడుగుల పల్లి( మే 04)ప్రతినిధి :** అకాల వర్షం వలన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి, లారీలు గన్ని బ్యాగ్స్ కొరత లేకుండా చూడాలని, తూకంలో మిల్లర్ల మోసాన్ని అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం మాడుగుల పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మాడుగుల పల్లి, ఇందుగల, ఆగ మోత్కూర్ ,చిరుమర్తి పోరెడ్డిగూడెం ,పాములపాడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిపిఎం ,రైతు సంఘాల ప్రతినిధి బృందం రైతులతో కలిసి పరిశీలించింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు కొనుగోలు కేంద్రాలలో కూడా అన్యాయాన్నికి గురకావడం ఏంటని ప్రశ్నించారు.మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని పంపడానికి లారీలు లేవనే సాకుతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలో రైతులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్స్ దగ్గరికి చేరుకున్న ధాన్యాన్ని క్వింటా కు రెండు నుండి నాలుగు కేజీలు తరువు తీస్తున్నారని మిల్లు యజమానులపై చర్య తీసుకోవాలని, సంబంధిత అధికారులు నీమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, అధికారులు జోక్యం చేసుకొని పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరిగేటట్లు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ప్రశ్నిస్తే తాలుందని నూకలు అవుతున్నాయని రకరకాల కారణాలు చెప్పి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వ్యాపారులు గ్రామాల్లో రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసి మార్కెట్లో రైతుల పేరుతో అమ్ముతున్నారని వీరికి మాత్రం లారీలు గన్ని బ్యాగ్స్, పుష్కలంగా అందుతున్నాయని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస వసతులు కూడా లేవని, సొసైటీ అధికారులు రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని రైతన్న ఆదుకోవడం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన పంట కొనక పోవడంతో ఈదురు గాలులు వర్షాలు వచ్చి రైతులు భారీ స్థాయిలో నష్టపోయే పరిస్థితి దాతరించిందని పెట్టిన పెట్టుబడులు వెళ్లక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఆయన అన్నారు, ధాన్యం కొనుగోలు కోసం కూడా రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మాది రైతు ప్రభుత్వం ప్రతి గింజ కొంటాం అని గొప్పలు పలికే సర్కారుకు రైతుల సమస్యలు అర్థం కావడం లేదా అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు లో జరుగుతున్న జాప్యం, రైతులను మోసం చేస్తున్న విధానానికి వ్యతిరేకంగా ఈనెల 11న జరిగే కలెక్టరేట్ ధర్నాకు రైతాంగం పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు. సిపిఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేవి రెడ్డి అశోక్ రెడ్డి సిపిఎం మండల కమిటీ సభ్యులు తంగేళ్ల నాగమణి పుల్లెముల శ్రీకర్ పుల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో కొనసాగుతున్న భూపంపి నిషేధం ఎత్తివేసి ప్రభుత్వ భూములను భూమిలేని పేదలకు పంచాలి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా






**ఆలేరు, మే 04(ప్రభాత సూర్య):** జిల్లాలో ఐదు మండలాల్లో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి జిల్లావ్యాప్తంగా పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాదారు పాసుబుక్కులు ఇచ్చి , మిగులు భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామ పరిధిలోని కే.బి.ఆర్ ఫంక్షణాల్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల 11వ మహాసభ బొమ్మకంటి లక్ష్మీనారాయణ, కేతావత్ లక్ష్మి అధ్యక్షతన జరగగా ఈ మహాసభకు ముఖ్య అతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ రోజురోజుకు గ్రామాలలో ఫామ్ హౌస్ ల పేరుతో, తోటల పేరుతో మళ్లీ కొంతమంది దగ్గరికి వందలాది ఎకరాల భూమి పోగవుతుందని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పంటలు పండే భూములను కూడా పడవ పెట్టి ఆహార కొరతను కూడా సృష్టిస్తున్నారని విమర్శించారు. నాడు సాయిధ రైతాంగ పోరాటంలో దున్నేవాడికి భూమి కావాలనే నినాదంతో భూస్వాముల భూములు గుంజి పేదలకు పంచారని తెలిపారు. ఇంకా జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములను, వివిధ పేర్లతో వందల ఎకరాల భూములను పోగు చేసుకుంటున్నా వారి వద్ద నుండి గుంజి రానున్న కాలంలో పేదలకు పంచుతామని తెలిపారు. పాలకులు మారుతున్న పేదల బతుకులు మారడం లేదని గత 20 సంవత్సరాలుగా కనీస వేతనాల చట్టం అమలు చేయకుండా కూలీల పొట్టలు కొడుతున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలీ 800 వందల రూపాయలకు ఇచ్చే విధంగా చట్టం చేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరిగి కూలీలకు పని దొరకడం లేదని ఉపాధి హామీ 200 రోజుల పని దినాలు కల్పించాలి, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి మాట్లాడుతూ ఈనెల 18, 19 తేదీలలో రామన్నపేట మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కూలీల, ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం వ్యవసాయ కార్మిక సంఘం అని తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించే జిల్లా మహాసభలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న భూమి, కూలీ, ఉపాధి, సంక్షేమం, వివక్షతలాంటి సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ఈ మహాసభలకు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ మహాసభలో మండల ప్రధాన కార్యదర్శి జూకంటి పౌలు పాల్గొని మాట్లాడిన అనంతరం 17 మందితో నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొమ్మకంటి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జూకంటి పౌలు ఉపాధ్యక్షులుగా కేతావత్ లక్ష్మి, పుట్టల రత్నం, చెక్కిళ ఉపెంద్ర, సహాయ కార్యదర్శిగా సైదాపురం నరసయ్య, ఎలగందుల రాములు, గ్యార అండాలు, ఈరసరపు ఆంజనేయులు మిగతా వారిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో గ్యార భాస్కర్, కోళ్ల సదానందం, శ్రీనివాస్, చెక్కిళ్ళ అంజమ్మ, గౌరమ్మ, కలమ్మ, లక్ష్మయ్య, ఉప్పలయ్య, సుధాకర్, రత్నం, యాదగిరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలి, బారదాన, లారీల కొరతను వెంటనే పరిష్కరించాలి

### కల్లూరి మల్లేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

**ఆలేరు మే 4 ప్రభాత సూర్య:** ఆలేరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్టు ను సిపిఎం ఆలేరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం మాట్లాడుతూ ఆలేరు మార్కెట్లో గత 15 రోజులకు పైగా వడ్లు పోసినప్పటికీ ఇప్పటివరకు కాంట కాలేదని నిన్నటి వరకు భారదాన కొరత వల్ల రైతులు ఎదురుచూశారని ఇప్పుడు లారీల సమస్య వల్ల అంతంత మాత్రమే వడ్లు కొనుగోలు చేస్తున్నారని ఆయన అన్నారు మార్కెట్లో వచ్చిన వడ్లు తూకం అయి మిల్లుకు పోకుండా మార్కెట్లోనే ఉండడం వలన అనేక మంది రైతులు రోజు వచ్చి స్థలం లేకపోవడం వలన తమ కల్లాలలోనే వడ్లు పోసుకొని ఎదురుచూస్తున్నారని మార్కెట్లో స్థలం లేకుండా పోవడం వలన ఇక్కడికి తీసుకురాగా కల్లాలలోనే వడ్లు పోసి ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అనుకోకుండా వర్షం పడి రైతులు ఆరుగాలంకష్టపడ్డ శ్రమ వరద నీటి పాలు అవుతుందని



దిన దిన గండంగా కాలం గడుపుతున్నారని అన్నారు. మార్కెట్లో రైతులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆలేరు మార్కెట్ యార్డులో వచ్చే ధాన్యం కి సరిపోను సీసీ లలేకపోవడం వలన మార్కెట్ అంతా గుంతలు గుంతలు ఉందని అన్నారు.ఈ పరిస్థితుల్లో గడ్డి వర్షం వస్తే మార్కెట్ కు వచ్చిన వరి ఇక్కడే మొల్కెత్తే పరిస్థితి ఉందని వెంటనే స్థానిక ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి ఆలేరు మార్కెట్ యార్డ్ కు సరిపోను సీసీ ని ఏర్పాటు చేసి రైతుల శ్రమను ధాన్యాన్ని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్, సిఐటియు నాయకులు మొరిగాడి రమేష్ ,రైతు సంఘం నాయకులు ఘనగాని మల్లేష్ గౌడ్,మోరిగాడి అశోక్, రైతులు ఇక్కిరి కొమరయ్య, పూల మహేందర్, బి పాపిరెడ్డి, లక్కాకుల రమేష్, గాదరి రాములు తదితరులు పాల్గొన్నారు

## ఆలేరులో వివిధ రాష్ట్రాల్లో బిజెపి గెలుపొందిన సందర్భంగా విజయోత్సవ సంబరాలు...

**ఆలేరు మే 4 ప్రభాత సూర్య:** 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు,వెస్ట్ బెంగాల్ , అస్సాం, పుదుచ్చేరి, తమిళనాడు ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా ఆలేరు పట్టణంలోనీ వివేకానంద చౌరస్తాలో పట్టణ అద్యక్షుడు నంద గంగేష్ ఆధ్వర్యంలో పార్టీ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.పార్టీ శ్రేణులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కమిటీకారి కృష్ణ , జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్డమాని నరేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగల వెంకటేష్,జిల్లా మహిళా నాయకురాలు సముద్రాల కల్పన, సీనియర్ నాయకులు మల్ రెడ్డి నరసింహారెడ్డి, తోట మల్లయ్య, పసుపు నూరి వీరేశం,చిరిగే శ్రీనివాస్, తునికి దశరథ, కళ్ళెం రాజు, మండల కార్యదర్శి బైరి మహేందర్, బూత్ అధ్యక్షులు గుర్రం నరసింహులు, అమృతము నర్సింలు, శ్యామల కిష్టయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## పశ్చిమబెంగాల్,అస్సాం పుదుచ్చేరి రాష్ట్రాలలో బిజెపి పార్టీ విజయం

### సంస్థాన్ బిజెపి శ్రేణులు సంబరాలు

### బిజెపి పార్టీ మండల అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్

సంస్థాన్ నారాయణపురం, మే 04(ప్రభాత సూర్య): సోమవారం వెలువడిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మూడు రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ,కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ నాయకత్వంలో పశ్చిమబెంగాల్ ,అస్సాం పుదుచ్చేరి రాష్ట్రాలలో విజయం సాధించిన సందర్భంగా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి విజయోత్సవ సంబరాలు చేసుకోవడం జరిగింది.



ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సుర్విరాజు గౌడ్ మాట్లాడుతూ.. దేశ ప్రజలు అభివృద్ధి,పారదర్శక పాలన, జాతీయతకు మద్దతునిస్తూ భారతీయ జనతా పార్టీకి ఘన విజయం అందించారని నరేంద్ర మోడీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసమే ఈ ఘనవిజయమని అన్నారు, ఇదే ఉత్సాహంతో తెలంగాణలో కూడా అధికారాన్ని చేపట్టడం కోసం ఈ నెల 10వ తారీఖున సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో జరిగే "జనాగ్రహ" భారీ బహిరంగ సభలో నరేంద్ర మోడీ పాల్గొని తెలంగాణ రాష్ట్రంలో సుమారు 7500 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో చిమిర్యాల గ్రామ సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు వెంకటాచారి జిల్లా నాయకులు వంగరి రఘు, నందగిరి జగత్ కుమార్, సూరపల్లి శివాజీ మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు వెంకటేష్, కొజ్జా ఉప సర్పంచ్ మండల ఉపాధ్యక్షుడు వెలిజాల శీను, మండల ఉపాధ్యక్షులు కట్కూరి లక్ష్మీ వెంకటేష్ గౌడ్ గొల్లూరు యాదగిరి,బీజేవైఎం మండల అధ్యక్షులు ఉప్మాగుల గిరిబాబు గౌడ్,గుండె మల్లేష్ యాదవ్,వార్డు సభ్యులు వంటల సువర్ణగణేష్ యాదవ్,సింగం బిక్షపతి, గూడూరు ఇంద్రసేనారెడ్డి,సంగిశెట్టి లక్ష్మీనారాయణ, బోడ అనిల్, కట్కూరి శ్రీకాంత్ గౌడ్, పాలకుర్ల లింగస్వామి గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు,బూత్ అధ్యక్ష,కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో మహిళా కాంగ్రెస్ పోస్ట్‌కార్డ్ సంతకాల సేకరణ



**కుత్బుల్లాపూర్, మే 02 (ప్రభాత సూర్య) :** జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షురాలు స్వర్ణమ్మ సూచనలతో మేడ్చల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పోస్ట్ కార్డులపై సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఏ బ్లాక్ అధ్యక్షురాలు రేణుక రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకులు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే లక్ష్యంతో పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేపట్టారు. స్థానిక మహిళలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాజాల రమ్య, ఏ బ్లాక్ ఉపాధ్యక్షురాలు అశ్విని, కార్యదర్శులు లతా, లలితమ్మ, మాధవి రెడ్డి, సహాయ కార్యదర్శి జాజాల అర్చన, డివిజన్ అధ్యక్షురాలు సుజాత యాదవ్, వారి కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పశ్చిమ బెంగాల్ లో బిజెపి ఘన విజయం...

### జీహెచ్ఎంసీ ఎన్నికలే తరువాయి

### బీజేపీ సీనియర్ నేత కంచి మహేందర్ ధీమా



**బాలానగర్, మే 04 (ప్రభాత సూర్య) :** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయాన్ని చారిత్రాత్మక మలుపుగా అభివర్ణిస్తూ, పార్టీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. "బెంగాల్‌లో సాధించిన విజయంతో దేశ రాజకీయ దిశ మారింది. అదే జోష్‌తో ఇప్పుడు మా లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికలని స్పష్టం చేశారు.ఫతేనగర్ డివిజన్‌లో ఆయన ఆధ్వర్యంలో జరిగిన సంబరాలు ఉత్సాహంగా సాగాయి. పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకుని క్రాకర్స్ కాల్చుతూ, ప్రధాని నరేంద్ర మోడీకి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ, "బెంగాల్‌లో చూపించిన ప్రజా మద్దతు జిహెచ్ఎంసి లోనూ పునరావృతమవుతుంది. ఫతేనగర్ డివిజన్ సహా మొత్తం హైదరాబాద్‌లో బీజేపీ విజయం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బానీష్, రమేష్, గుప్తా, ఉష, దినేష్, చింటూ, మహాలక్ష్మి, గోపాల్, దశరత్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సంబరాల మధ్య కాషాయ శక్తి మరింత బలపడుతోందని నాయకులు పేర్కొన్నారు.

# జిల్లాలో కొనసాగుతున్న భూపంపి నిషేధం ఎత్తివేసి ప్రభుత్వ భూములను భూమిలేని పేదలకు పంచాలి..

### తెలంగాణ వ్యవసాయ కార్మిక రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ...

**ఆలేరు మే 4 ప్రభాత సూర్య:** యాదాద్రి జిల్లాలో ఐదు మండలాల్లో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి జిల్లావ్యాప్తంగా పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాదారు పాసుబుక్కులు ఇచ్చి , మిగులు భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆలేరు మండలంలోని గుండ్లగూడెం గ్రామ పరిధిలోని కే.బి.ఆర్ ఫంక్షన్ హాల్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల 11వ మహాసభ బొమ్మకంటి లక్ష్మీనారాయణ, కేతావత్ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు .ఈ మహాసభకు ముఖ్య అతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ రోజురోజుకు గ్రామాలలో ఫామ్ హౌస్ ల పేరుతో, తోటల పేరుతో మళ్లీ కొంతమంది దగ్గరికి వందలాది ఎకరాల భూమి పోగవుతుందని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పంటలు పండే భూములను కూడా పడవ పెట్టి ఆహార కొరతను కూడా సృష్టిస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములను మరియు వివిధ పేర్లతో వందల ఎకరాల భూములను పోగు చేసుకుంటున్నా వారి వద్ద నుండి గుంజి రానున్న కాలంలో పేదలకు పంచుతామని తెలిపారు. పాలకులు మారుతున్న పేదల బతుకులు మారడం లేదని గత 20 సంవత్సరాలుగా కనీస వేతనాల చట్టం అమలు చేయకుండా కూలీల పొట్టలు కొడుతున్నారని






విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలీ 800 వందల రూపాయలకు ఇచ్చే విధంగా చట్టం చేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరిగి కూలీలకు పని దొరకడం లేదని ఉపాధి హామీ 200 రోజుల పని దినాలు కల్పించాలి, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి మాట్లాడుతూ ఈనెల 18, 19 తేదీలలో రామన్నపేట మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కూలీల, ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం వ్యవసాయ కార్మిక సంఘం అని తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించే జిల్లా మహాసభలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న భూమి, కూలీ, ఉపాధి, సంక్షేమం, వివక్షతలాంటి సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు.ఈ మహాసభలకు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పాల్గొంటున్నారని తెలిపారు.మండల ప్రధాన కార్యదర్శి జూకంటి పౌలు పాల్గొని మాట్లాడిన అనంతరం 17 మందితో నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొమ్మకంటి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జూకంటి పౌలు, ఉపాధ్యక్షులుగా కేతావత్ లక్ష్మి, పుట్టల రత్నం, చెక్కిళ ఉపెంద్ర, సహాయ కార్యదర్శిగా సైదాపురం నరసయ్య, ఎలగందుల రాములు, గ్యార అండాలు, ఈరసరపు ఆంజనేయులు మిగతా వారిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో గ్యార భాస్కర్, కోళ్ల సదానందం, శ్రీనివాస్, చెక్కిళ్ళ అంజమ్మ, గౌరమ్మ, కలమ్మ, లక్ష్మయ్య, ఉప్పలయ్య, సుధాకర్, రత్నం, యాదగిరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం.. బేజాడి కుమార్ AIKమీ జిల్లా ప్రధాన కార్యదర్శి...

ఆలేరు మే 4 ప్రభాత సూర్య : రైతులు పండించిన దాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయడం ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని అఖిల భారత రైతు -కూలీ సంఘం (ఏ.ఐ.కె.యం.ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ అన్నారు. ఆలేరు పట్టణంలో బేజాడి కుమార్ విలేకరులతో మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఐకేపీ , పి ఎ సి ఎస్, స్వచ్ఛంద సంస్థలు కేంద్రాలలో ప్రభుత్వ వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు రోజుల తరబడి నిరీక్షణ చేస్తున్నారని అన్నారు. 45 డిగ్రీల ఎర్రటి ఎండలో అవస్థలు పడుతున్నారని తెలిపారు. లారీల కొరత మూలంగా అన్ని వడ్ల కొనుగోలు సెంటర్ల వద్ద 100 నుండి 1000 బస్తాల వరకు బస్తాలు నిల్వ ఉండడం జరిగింది.ధాన్యం కొనుగోలు ఆగిపోయిందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై అధికార



యంత్రాంగం స్పందించి కొనుగోలును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద బస్తాకు రెండు నుండి నాలుగు కేజీల తరుగు తీస్తున్నారని, రైతుల వద్ద బస్తకు రెండు లేదా నాలుగు రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ దోపిడీని అరికట్టాలని తెలిపారు. ఐకేపీ , పి ఏ సి ఎస్ , స్వచ్ఛంద సంస్థ సెంటర్స్ లల్లో కనీసం సౌకర్యాలు లేవని టెంట్, మంచినీళ్లు, మెడికల్ కిట్ తదితర వసతులుండాలని అన్నారు. అకాల వర్షాలకు తడవకుండా టార్పిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి అప్పులపాలై పంట పండిస్తున్నాడని, కనీస మద్దతు ధర లేక వ్యవసాయానికి దూరం అవుతున్నారని అన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే మోడీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రైతాంగం ఉద్యమించాలని అన్నారు.


## భాషిత జూనియర్ కాలేజ్ అక్రమ కార్యకలాపాలపై అధికారులకు ఎన్ ఎస్ యు ఐ గట్టి హెచ్చరిక

ఏదైనా ప్రమాదం జరిగాకే అధికారులు మేల్కొంటారా

అక్రమ క్యాంపస్ పై వెంటనే తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన గొల్ల జాన్

**కూకట్ పల్లి, మే 04 (ప్రభాత సూర్య) :** భాషిత జూనియర్ కాలేజ్ అక్రమంగా క్యాంపస్ నిర్వహిస్తూ, వందలాది మంది విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న విషయంపై జిల్లా పరిపాలన నిర్లక్ష్యాన్ని తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ తీవ్రంగా ఖండించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు మరోసారి ఫిర్యాదు సమర్పించిన ఆయన, అక్రమంగా నడుస్తున్న క్యాంపస్‌ను వెంటనే సీజ్ చేసి, కాలేజ్ యాజమాన్యంపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా కలెక్టర్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి, ఇతర సంబంధిత విభాగాలకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెన్ని ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటారు? ఏదైనా ప్రమాదం జరిగాకే అధికారులు మేల్కొంటారా? అని గొల్ల జాన్ ప్రశ్నించారు. కాలేజ్ యాజమాన్యం ఫైర్ సేఫ్టీ నిబంధనలు, అవసరమైన అనుమతులు సహా అనేక నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నప్పటికీ, రాజకీయ పరిరక్షణతో, పరిపాలనా నిర్లక్ష్యంతో కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. పరిపాలనా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఆయన హెచ్చరించారు. ఈ తీవ్రమైన సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఎన్ ఎస్ యు ఐ మౌనంగా ఉండదని, విద్యార్థుల భద్రత కోసం రోడ్లపైకి వచ్చి పోరాటం చేస్తాం అని అన్నారు. అక్రమ క్యాంపస్‌పై వెంటనే తనిఖీలు చేసి మూసివేయాలి, కాలేజ్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి, చర్యలు తీసుకోని బాధ్య అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఎన్ ఎస్ యు ఐ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని గొల్ల జాన్ స్పష్టం చేశారు.


NATIONAL STUDENTS UNION OF INDIA
TELANGANA STATE
GOLLA JOHN






### తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతిచ్చిన ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు

తమిళనాడు అభివృద్ధి, సంక్షేమానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని హామీ

2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఎన్నికల్లో తమ నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే)కు మద్దతుగా నిలిచిన తమిళనాడు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో, తొలిసారి ఎన్నికల బరిలో నిలిచి సత్తా చాటిన నటుడు విజయ్, ఆయన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు అభినందనలు తెలియజేశారు. ఫలితాల వెల్లడి అనంతరం సోమవారం సోషల్ మీడియా వేదికగా మోదీ ఒక సందేశం పోస్ట్ చేశారు. "తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతు పలికిన ఓటర్లకు నా కృతజ్ఞతలు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, వారి జీవితాలను మెరుగుపరచడంలో మేము ఎల్లప్పుడూ ముందుంటాం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్న తరుణంలో, టీవీకే అరంగేట్రంతోనే కీలక శక్తిగా అవతరించింది.



## సందేశంతో ఓ అందాల రాక్షసి

స్వీయ దర్శకత్వంలో షెరాజ్ మెహదీ హీరోగా నటించిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. స్కై ఈజ్ ది లిమిట్ స్టూడియోస్ పతాకంపై సురీందర్ కౌర్ నిర్మించారు. గతంలోనే ఈ సినిమా విడుదలైంది. తాజాగా ప్రేక్షకుల అభ్యర్థన మేరకు ఈ చిత్రాన్ని ఈ నెల 24న రీరిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఇటీవల మీడియా సమావేశాన్ని నిర్వహించారు. మహిళా ప్రధాన చిత్రమిదని, చక్కటి సందేశంతో ఆకట్టుకుంటుందని, సమాజంలో అమాయక మహిళలు ఎలా మోసపోతున్నారనే అంశాన్ని చూపించడంతో పాటు మోసాలకు పాల్పడేవారికి శిక్ష తప్పదనే సందేశాన్ని కూడా అందించామని మేకర్స్ తెలిపారు. విహాన్షి హెగాడే, కృతివర్మ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం, దర్శకత్వం: షెరాజ్ మెహదీ.



## వ్యసనం.. ఓ మానసిక రోగం

ఏ వ్యసనమైనా విలాసం కాదనీ, అది ఓ మానసిక రోగమని అంటున్నది బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్. షూటింగ్‌లతో ఎప్పుడూ బిజీగా ఉండే జాన్వీ.. సామాజిక అంశాలపైనా బాధ్యతతో వ్యవహరిస్తుంటుంది. మద్యపానం, దాని వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తుంటుంది. ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి.. మద్యపానంపై ఓ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నది. ఈ సందర్భంగా మద్యపానం, దాని వల్ల కలిగే ఇబ్బందుల గురించి కీలక వ్యాఖ్యలు చేసింది. "మద్యానికి బానిసలైన వ్యక్తులను, వారి వ్యక్తిత్వాన్ని ఎవరూ తక్కువ చేయొద్దు. నిజానికి మద్యపానంతో పాటు ఏ వ్యసనమైనా.. చెడు అలవాటు కాదు. ఒక మానసిక సమస్య మాత్రమే. ఒత్తిడి, బాధలు, వ్యక్తిగత సమస్యల వల్లే చాలామంది వాటికి అలవాటు పడతారు. అలాంటివారిని నేరస్తుల్లా కాకుండా.. రోగుల్లా చూడాలి. వారిని విమర్శించడం, దూరంగా ఉంచడం వంటివి చేయొద్దు. వారికి ప్రేమను పంచాలి. తోటివారి నుంచి సానుభూతి, మద్దతు లభిస్తేనే అలాంటి వారు త్వరగా మారతారు" అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ. మద్యపానం తన జీవితంపైనా ప్రభావం చూపిందని వెల్లడించింది. "నేను కూడా అప్పుడప్పుడూ మద్యం తీసుకునేదాణ్ని. కానీ, కొన్నిరోజులకు నాకు తెలియకుండానే దానికి బానిసగా మారిపోయా! వ్యసనం అంటే మనతో ఎవరో అపరిచిత వ్యక్తి ఉనట్టే అనిపిస్తుంది. మన ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కూడా జాగ్రత్తగా అడుగులు వేయాల్సి వచ్చేది. ఈ అలవాటు గురించి గతంలో నేనెప్పుడూ మాట్లాడలేదు. కానీ, నా చుట్టూ ఉన్నవాళ్లు కూడా ఈ సమస్యతో బాధపడటం చూసిన తర్వాత, ఇది మానసిక ఆరోగ్య సమస్య అని అర్థమైంది. ఈ వ్యసనం వల్ల జీవితంలో ఎన్నో కోల్పోతామనీ, ఎంతో నష్టపోతామని తెలిసిన తర్వాత.. ఏం చేయాలనే దానిపై అవగాహన వచ్చింది" అంటూ చెప్పుకొచ్చింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. దేవర చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది జాన్వీ. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన పెద్దిలో నటిస్తున్నది. ఈ సినిమా త్వరలోనే విడుదల కానున్నది.



## హారర్ థ్రిల్లర్ '418'

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్, అగ్ర దర్శకుడు ప్రశాంత్‌నీల్ భాగస్వామ్యంలో తెరకెక్కుతున్న తాజా చిత్రానికి '418' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రశాంత్‌నీల్ సమర్పకుడు. సూర్యరాజ్, హనురెడ్డి, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. ఓ గ్రామంలోని మెడికల్ కాలేజ్ నేపథ్యంలో జరిగే కథ ఇదని, సైన్స్, మూఢనమ్మకాల మధ్య అర్థంకాని ఓ రహస్యాన్ని ఛేదించే క్రమంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వెంకీ జీ, సంభాషణలు: మోహన్ బి ఎస్, దర్శకత్వం: కీర్తన్ నాదగౌడ.



## ఒకవేళ అనుష్క అలా చేస్తే.. నిజంగా షాకింగే

హీరోయిన్ అనుష్క శెట్టి బయట కనిపించి చాలా ఏళ్లు గడిచిపోయింది. 'బాహుబలి' తర్వాత పాన్ ఇండియా క్రేజ్ వచ్చినప్పటికీ ఆచితూచి సినిమాలూ చేస్తూ వస్తోంది. అయితే 'సైజ్ జీరో' చేసిన తర్వాత ఈమెకు బరువు సమస్యలు రావడంతో మూవీస్ అయితే చేస్తోంది గానీ ప్రచారానికి మాత్రం నో చెబుతూనే వస్తోంది. గతేడాది 'ఘాటీ' చిత్రం చేసింది. దీని ప్రమోషన్‌లోనైనా కనిపిస్తుందేమోనని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేం జరగలేదు. అలాంటిది ఇప్పుడు చిత్రమైన రూమర్ వినిపిస్తోంది. అనుష్క ఇప్పటివరకు తెలుగు, తమిళంలో మాత్రమే సినిమాలు చేసింది. తొలిసారి మలయాళంలో 'కథనార్' అనే మూవీలో నటించింది. రీసెంట్‌గానే తెలుగు వెర్షన్ ట్రైలర్ కూడా రిలీజ్ చేశారు. ఇందులో స్వీటీని ఒకటి రెండు షాట్స్‌కే పరిమితం చేయడంతో ఆమె ఫ్యాన్స్ కాస్త డిసప్పాయింట్ అయ్యారు. అయితే ఎప్పుడూ లేని విధంగా ఈ చిత్ర ప్రచారానికి అనుష్క.. ఏకంగా హైదరాబాద్ వస్తుందని టాక్ వినిపిస్తోంది. కానీ ఆడియెన్స్ మాత్రం నమ్మట్లేదు. ఎందుకంటే తెలుగులో నేరుగా సినిమాలు చేసినప్పుడే వాటిని ప్రమోట్ చేసేందుకు బయటకు రాలేదు. అలాంటిది ఓ మలయాళ డబ్బింగ్ చిత్రం కోసం హైదరాబాద్ వస్తుందా? సందేహమే అని మాట్లాడుకుంటున్నారు. ఈ ఏడాది ద్వితియార్థంలోనే మూవీ థియేటర్లలోకి వస్తుందని అధికారికంగా ప్రకటించారు. కానీ ఏ నెల అనేది మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. 9వ శతాబ్దానికి చెందిన కథనార్ అనే క్రైస్తవ మతప్రచారకుడి జీవితం ఆధారంగా దీన్ని తెరకెక్కిస్తున్నారు.



## కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందన్న హన్సిక

తెలుగు, తమిళ చిత్రాలతో 'యాపిల్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్న హన్సిక, తన విడాకుల వార్తలపై ఎట్టకేలకు మౌనం వీడారు. భర్త సోహెల్ కతురియాతో నాలుగేళ్ల బంధానికి స్వస్తి పలుకుతూ ముంబై కోర్టులో విడాకులు తీసుకున్నట్లు వస్తున్న వార్తలపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. "మనం తప్పు ట్రైన్ ఎక్కామని తెలిసినప్పుడు, వీలైనంత త్వరగా దిగిపోవడమే మంచిది" అంటూ వైవాహిక బంధం ముగియడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తన నిర్ణయం పట్ల తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆమె స్పష్టం చేశారు. జనాలకు హెడ్ లైన్స్, క్లిక్ బైట్స్ కావాలి కానీ, తనకు వ్యక్తిగత ప్రశాంతత అంతకంటే ముఖ్యమని హన్సిక పేర్కొన్నారు. విడాకుల తర్వాత మానసిక ప్రశాంతత కోసం జపాన్ వెళ్లి వచ్చానని, ఈ కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందని తెలిపారు. 2022లో అట్టహాసంగా జరిగిన ఈ వివాహం, ఓటీటీలో డాక్యుమెంటరీగా కూడా విడుదలైంది. అప్పట్లో హన్సిక తన స్నేహితురాలి మాజీ భర్త అయిన సోహెల్ ను పెళ్లాడడం చర్చనీయాంశం అయింది. ఇప్పుడు వీరిద్దరి బంధం కూడా ముగియడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏదేమైనా, తన శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తూ హన్సిక తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.